
హైదరాబాద్ వార్త



# ఫుడ్ సేఫ్టీపై జిహెచ్ఎంసి ఫోకస్!


- జోన్‌కు ఒక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్..
- కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేసేలా చర్యలు
- అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్న అధికారులు



**హైదరాబాద్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** గ్రేటర్లో రోజురోజుకు పెరుగుతున్న కల్తీ ఆహార విక్రయాలకు బ్రేక్ వేయటంతో పాటు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను పెంచే దిశగా సర్కార్ ఫోకస్ చేసింది. ముఖ్యంగా హైదరాబాద్లో ఏడు సర్కిళ్ల నుంచి 30 సర్కిళ్లకు విస్తరించటంతో పాటు జనాభా కూడా కోటి 20 లక్షలు దాటుతుందని అధికారుల అంచనా. ప్రస్తుతం కేవలం 21 మంది ఫుడ్ ఇన్స్పెక్టర్లు ఉన్నందున ఆశించిన స్థాయిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పెరగకపోవటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు జిహెచ్ఎంసి కసరత్తు చేస్తుంది. కొద్దిరోజుల క్రితం ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ ఆర్వి కన్నన్, హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పంకజలతో ప్రభుత్వ పెద్దలు కీలక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఈసందర్భంగా ఆహార విక్రయ కేంద్రాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నామన్న విషయాన్ని అధికారులు ప్రస్తావించగా మరో 30 మందిని కేటాయించే ప్రతిపాదనకు సర్కారు అంగీకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం మహానగరంలోఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించి సేకరించే శ్యాంపిల్స్ నాణ్యత, కల్తీని తేల్చేందుకు టెస్టులు నిర్వహించేందుకు హబ్సిగూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూటీషియన్ (ఎన్ఐఎన్) పని చేస్తుంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడుస్తున్నారెండు తెలుగు రాష్ట్రాలకు ఒకే ల్యాబ్ అందుబాటులో ఉంది. ఈ ల్యాబ్లో 75 శాతం జీహెచ్ఎంసీకి చెందిన శ్యాంపిల్స్ టెస్టులు జరుగుతుండగా ఏపీ నుంచి మరో 25 శాతం శ్యాంపిల్స్ టెస్టులకు వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సకాలంలో రిపోర్టులు కూడా రావటం లేదన్న విషయం ప్రస్తావనకు రాగా జీహెచ్ఎంసీ లోని ఆరు జోన్లలో జోన్‌కు ఒకటి చొప్పున మొత్తం ఆరు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించనిట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 1700 కాలనీ, బస్తీలకు చెందిన కమ్యూనిటీ హాళ్లున్నాయని, వీటిలో కొన్నింటిలో ఇప్పటికే బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. అలాగే ఫుడ్ టెస్టు ల్యాబ్ల కోసం స్థలాలను జీహెచ్ఎంసీ సూచించాలని సర్కారు ఆదేశించడంతో కమ్యూనిటీహాళ్లను అన్వేషించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అలాగే గడిచిన రెండు నెలల వ్యవధిలోనే జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలోని దాదాపు 1444ఆహార విక్రయ కేంద్రాలు, నిత్యావసరాలు విక్రయించే సంస్థలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో మొత్తం 203 శాంపిల్స్‌ను సేకరించగా 13 శాంపిల్స్ లో లోపాలు, కల్తీని ఉన్నట్లు గుర్తించామనివీటిలో నాలుగు శ్యాంపిల్స్ అన్‌సేఫ్‌గా తేలినట్లు అధికారులు తెలిపారు.

# నగరంలో భారీ వర్షం

- -ఈదురు గాలులు, వడగండ్ల వాన
- -కూలిన చెట్లు...పేలిన ట్రాన్స్‌ఫార్మర్
- -పలుప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం





**హైదరాబాద్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** గ్రేటర్‌లో వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. గురువారం ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడ్డ నగరవాసులకు సాయంత్రం ఇక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆతర్వాత సాయంత్రం 6గంటల నుంచి నగరంలోని పలుచోట్ల ఈదురుగాలులతో మొదలై క్రమక్రమంగా నగరమంతా విస్తరింది. ఈదురు గాలులతో పలు చోట్ల భారీ వర్షం కారణంగా రోడ్లపై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నాంపల్లి, హిమాయత్ నగర్, ముషీరాబాద్, ఖైరతాబాద్‌లో ఈదురు గాలులలో కూడిన వాన కురిసింది. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం పడింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా పరిధిలో ముందుగా ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి. తరువాత భారీ వర్షంగా మొదలైంది. అమీర్‌పేట్, పంజాగుట్ట, మధురనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పరిసరాల ప్రాంతాలతోపాటు అటు కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్, కార్వాన్, ఎల్బీనగర్, వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోనూ వర్షం కురిసి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అలాగే సికింద్రాబాద్ పరిధిలోని బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైస్ చిలకలగూడ ప్రాంతాలలోనూ వర్షం కురిసింది. కోకాపేటలో ఈదురుగాలుల బీభత్సానికి నిర్మాణ సామాగ్రి గాల్లో ఎగురుతూ కనిపించాయి.

**పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. కూలిన చెట్లు**

నాంపల్లి రెడీహిల్స్ రోడ్డుపై ఓ భారీ వృక్షం కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. అస్మాన్‌ఘాడ్ విద్యుత్ డివిజన్ పరిధిలో 67 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యం చోటు చేసుకుంది. బషీరాబాగ్‌లోని పీజీలా కాలేజ్ ఎదుట రోడ్డుపై ఓ చెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్యాంక్ బండ్ నుంచి లోయర్ ట్యాంక్బండ్ వెళ్లే రోడ్డులో చెట్టు కూలిపోయి.. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. లంగర్ హౌస్ బాపునగర్ కాలనీలో చెట్టు కూలి.. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇలానగర వ్యాప్తంగా 21చెట్లు కూలిపోగా వెంటనే పునరుద్ధరించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు.





# కమలం పార్టీలో మరోసారి బయటపడిన అసంతృప్తి

## - కీలక సమావేశానికి డుమ్మాకొట్టిన ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త** బీజేపీలో మరోసారి అసంతృప్తి బయటపడింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై జరిగిన సమావేశానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డుమ్మాకొట్టారు. శుక్రవారం బేగంపేటలోని హరితప్లాజాలో జరిగిన సమావేశానికి రాజాసింగ్ మరోసారి దూరంగా ఉన్నారు. కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ నెల 23న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రధానంగా చర్చించారు. ఓటింగ్‌కు కార్పొరేటర్లు గైర్హాజరు అవ్వకుండా కిషన్‌రెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. నగరంలోని బీజేపీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ సమావేశానికి రాకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ప్రధాన పోటీగా ఉందని తెలిసి కూడా రాజాసింగ్ భేటీకి హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎంపి ఎన్నికల సమయం నుంచి పార్టీలో జరిగే కీలక మీటింగ్‌లకు రాజాసింగ్ గైర్హాజరు అవుతూనే ఉన్నారు. కిషన్ రెడ్డి, రాజాసింగ్ మధ్య తీవ్ర స్థాయిలో విభేధాలు నడుస్తున్నట్లుగా పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్ష హోదాలో ఉన్న కిషన్ రెడ్డి కొద్దిమందికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, కొద్ది సంవత్సరాలుగా పార్టీలో కొందరు పేరుకుపోయారని, వారిని తక్షణమే పార్టీ నుంచి బయటకు పంపిస్తే తప్ప బీజేపీ రాష్ట్రంలో మనుగడ లేదు అని కొద్దిరోజులుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థిని ఎంపిక చేసే సమయంలో కూడా రాజాసింగ్ తన అభిప్రాయాన్ని రాష్ట్ర నాయకత్వానికి బాహాటంగానే వ్యక్తపరిచారు. ఈ అభ్యర్థిత్వాన్ని ఆమోదించబోమని, బీసీలకు అవకాశం ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం ఇవ్వాలని రాజాసింగ్ విమర్శలు గుప్పించారు. అయితే బండి సంజయ్ కలుగుజేసుకుని రాజాసింగ్‌కు సముదాయించే ప్రయత్నం చేశారు. హనుమాన్ జయంతి రోజున ఎమ్మెల్సీ అభ్యర్థి, పార్టీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావును వెంటతీసుకొని రాజాసింగ్ కలుసుకొని మాట్లాడారు.

రాష్ట్ర నాయకత్వం తరపు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పూర్తిస్థాయిలో ప్రాధాన్యత ఇచ్చే బాధ్యత తనది అంటూ బండి సంజయ్ భరోసా ఇచ్చేందుకు ప్రయత్నించారు. అంతా కలిసే పనిచేస్తామని, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తామని మీడియా సమావేశంలో రాజాసింగ్ చెప్పారు కూడా. అయితే హనుమాన్ జయంతి రోజు పార్టీలో సయోధ్యకుదిరిందని అంతా భావించినప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికలపై జరిగిన సమావేశానికి రాజాసింగ్ దూరంగా ఉండటంతో పార్టీ విభేదాలు సర్దుమణగలేదా అనే చర్చ మరోసారి ఊపందుకుంది.

# చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్

**చార్మినార్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ప్రపంచ వారసత్వ దినోత్సవం (2025) సందర్భంగా శుక్రవారం డక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, ఫోరమ్ ఫర్ బెటర్‌తో పాటు పలు పౌర సంఘాల భాగస్వామ్యంతో చార్మినార్ నుంచి చౌ మహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ కార్యక్రమం జరిగింది. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ వేద కుమార్ చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద కుమార్ పాతబస్తీలోని చారిత్రక కట్టడాల విశిష్టత గురించి తెలియజేశారు. సౌత్ జోన్ ప్రతినిధి ఐకామ్‌మోస్ (ఇండియా)ప్రొఫెసర్ జి.ఎస్.వి.సూర్యనారాయణ మూర్తి డాక్టర్.ప్రాచీన భారత చరిత్ర, పురావస్తు శాఖకు చెందిన జయశ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంకు చెందిన కోటయ్య, ఎఎస్ఐ అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ సాయిక్రిష్ణ, కన్జర్వేషన్‌జిస్ట్ సాయిరామ్, నిర్వహకులు సుధాకర్, తెలంగాణ టూరిజం డిటిఓ ఎస్.ప్రభాకర్, హెరిటేజ్ వాక్ ఇంఛార్జి డి.శ్యామ్ సుందర రావు, తెలంగాణ గిరిజన మ్యూజియం క్యూరేటర్ డాక్టర్, ద్యావనపల్లి సత్యనారాయణ, బౌద్ధతత్వ ఫౌండేన్ అధ్యక్షులు పి.వీరమల్లు, సిటీ కళాశాల విద్యార్థులతో పాటు పలువురు పాల్గొన్నారు. చార్మినార్ నుంచి ప్రారంభమైన హెరిటేజ్ వాక్ లాడ్‌బజార్, మోతీగల్లీ, ఇక్బాల్ ఉద్‌దౌలి దేవిడి, జూలూఖానా, ఇక్బాల్ ఉద్ దౌలా ప్యాలెస్, ఖిల్వత్ మీదుగా చౌమహల్లా ప్యాలెస్ వరకు కొనసాగింది.




హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ వేద కుమార్ మణికొండ

# కొత్త బట్టల ముచ్చట తీరకుండానే...

- -కరోనాతో మొదలైన ఆరోగ్య సమస్యలకు తోడు మానసిక ఒత్తిళ్లే కారణమా?
- -ఆర్థికంగా బలంగానే ఉన్నా ఒంటరితనంతో సతమతమైతే అంతేనా?
- -ఒంటరితనం అత్యంత ప్రమాదకరమని నిరూపించిన తేజస్వినీ ఉదంతం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త** ముక్కుపచ్చలారని తన ఇద్దరు పిల్లలను కొబ్బరికాయలు కోసే కత్తితో తలలు తెగనరికిన తల్లి పాషాన హృదయం వెనక దాగివున్న భడభాగ్ని...సంఘటన జరిగిన తరువాతగానీ తెలుసుకలేక పోయిన భర్త, ఆమె తల్లిదండ్రులు... గురువారం గాజులరామారం బాలాజీ లేఅవుట్ సహస్ర మహేష్ హైట్స్‌లో మృతిచెందిన విషయం విదితమే.. అయితే తేజస్వినీ తన కన్నపేగునే తెంపుకున్నతీరు వెనక ఎంత దీనగాథ వుందో అనేవిషయమై ఆమె తల్లిదండ్రులు, భర్త చెబుతున్న కథనాలు కంటికి కన్నీరు రాకుండా మానవు. ఏదిఏమైనా ముక్కుపచ్చలారని చిన్నారులను కొబ్బరికాయలు కొట్టే వేటకొడవలితో గొంతుకోసి నరకడం వంటి ఖర్కశమైన నిర్ణయానికి దారితీసిన పరిస్థితులు ఏమైనా ప్రతిఒక్కరికీ కలచివేసే తీరు బాధాకరం. పన్నెండేళ్లక్రితం ఖమ్మం జిల్లా సత్తుపల్లినుండి ఉద్యోగం నిమిత్తం నగ శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడకు సమీపంలోని గాజులరామారం గ్రామ సమీపంలోని సహస్ర మహేశ్‌హైట్స్‌లో స్వతంగా ఫ్లాటుకొనుక్కొని ఉంటున్నారు. అయితే తేజస్వినీ తన ఇద్దరు మగపిల్లలలో పెద్దవాడైన హర్షిత్‌రెడ్డి జన్మదినం శనివారం కావడంతో తేజస్విని తల్లిదండ్రులు గురువారం మధ్యాహ్నం మూడున్నరకు ఫోన్‌చేసి పిల్లల గురించి ఆరాతీసి తాము మనవడు హర్షిత్‌రెడ్డి జన్మదిన వేడుకలకు నగరానికి వస్తున్నట్లు ఘనంగా వేడుకలు నిర్వహించుకుందామని భరోసా ఇచ్చి తాము కొత్తబట్టలు తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. దీనితో తేజస్విని సరేనని చెప్పి ఫోన్‌ను 03.30గంటలకు ఫోన్‌పెట్టేసి గంట గడవక ముందే నాలుగున్నరకు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకుందన్న వార్తవిని తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. ఇంతలో ఇంతపని చేసిందేమిటని ఆశ్చర్యపోయారు. 2020లో వచ్చిన కరోనాతో తమకుటుంబంలో తీవ్ర ఆర్థిక సంక్షోబంలోకి నెట్టిందని దీని నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు తల్లిదండ్రులు, భర్త వెంకటేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. తన కూతురుతో గంటక్రితం నింపాదిగా మాట్లాడినతల్లికి గంటలోపే చనిపోయేంతగా మానసిక సంక్షోభంలో తన కూతరు వుందనే విషయం తెలుసుకోలేక పోయిన తల్లివేదన వర్ణనాతీతం. మనవళ్లతో మాట్లాడుతానన్న అమ్మమ్మకు పిల్లలు క్రింద ఆడుకుంటున్నారని రాగానే ఫోన్ ఇస్తానని చెప్పిన కూతురు ఇంత దారుణానికి ఒడిగట్టిందంటే వారు నమ్మలేకపోతున్నారు.

మానసిక వత్తిళ్లు...శారీరక రుగ్మతలతో తీవ్రంగా సతమతమయ్యే మహిళల తీరు చూస్తుంటే వారు ఏక్షణంలో ఏ నిర్ణయాలను తీసుకుని వారితోపాటు వారి కుటుంబాలకు సైతం ఏవిధమైన నష్ట కల్గించే ప్రమాదం ఉందో తేజస్విని ఉదంతం చూస్తే తెలుస్తుంది. కుటుంబ సమస్యల నేపథ్యంలో బార్య, భర్తల మధ్య పెరుగుతున్న దూరాన్ని తగ్గించేందుకు ప్రస్తుతతరుణంలో ఇరువురు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధంగా ఉండాలో ఇట్టే చెబుతున్నాయి. శుక్రవారం సాయంత్రం తేజస్వినీ తోపాటు చనిపోయిన తన ఇద్దరు కుమారులు హర్శిత్‌రెడ్డి, ఆశీస్‌రెడ్డిల అంత్యక్రియల నిమిత్తం పోలీసులు శవాలను కుటుంబ సభ్యులకు అప్పగించిన నేపథ్యంలో గాజులరామారంలో అంత్యక్రియలు ముగిసాయి.

# కళలు మానసికోల్లాసం సంపూర్ణ ఆరోగ్య హేతువు

## -కళావైభవంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు




జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు పొందిన గురువులు, కళాకారులతో అతిథులు సుధాకర్, రామసత్యనారాయణ, రమణారావు, దైవజ్ఞశర్మ తదితరులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** కళలు మానసిక ఉల్లాసంతో పాటు మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడుగా ఉండడానికి ఎంతగానో తోడ్పడతాయని, వరల్డ్ హెల్త్ డే వేడుకలను కళావైభవం శీర్షికన వివిధ కళారూపాలు, కళాంశాలతో నేత్రపర్వంగా జరపడం సబబుగా ఉందని వక్తలు నిర్వాహక సంస్థను, లయన్ కె.వి.రమణారావును ఎంతగానో అభినందించారు. పిల్లలకు చిన్ననాటి నుండే కళలను నేర్పించడం ద్వారా కేవలం కళాపోషణే కాకుండా మేధస్సును పదునుపెట్టడం తోపాటు ఆరోగ్యవంతులుగా తయారవ్వడానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రతీఒక్కరూ ఏదో ఒక కళలను తప్పక అభ్యసించాలని బోధించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ, ప్రముఖ సాంస్కృతిక సంస్థ జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు నిర్వహణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను కళా వైభవంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చకిలం అసోసియేట్స్ ఎండి చకిలం సుధాకర్, విశిష్ట అతిథులు సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, సినీనిర్మాత, దర్శకుడు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఆయుష్‌శాఖ యోగా శిక్షకురాలు ఎ.మమత, లయన్ కె.వి.రమణారావు తదితరులతో కలిసి నేటి కళావైభవంలో వివిధ నృత్యప్రదర్శనలు కావించిన కళాకారుల గురువులు 10మందిని జ్ఞాపికలతో, కళాకారులను ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



**కంటోన్మెంట్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** షాట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏపి 39 సివి 3484 నెంబర్ గల కారులో శుక్రవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి సంగీత్ చౌరస్తా మీదుగా తార్నాక వైపు వెళ్తుంది. సంగీత్ చౌరస్తాలో అకస్మాత్తుగా కారు ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న డాక్టర్ మాధవి, డ్రైవర్‌లు కారు దిగి పరిశీలిస్తుండగా అకస్మాత్తుగా బ్యాటరీ ద్వారా షాట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు, ఎస్ఐ సతీష్‌లు పక్క ఉన్న పెట్రోల్ బంక్‌లో నుంచి నీటి సహాయంతో మంటలను ఆర్పారు. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీస్తుకున్నారు.

# కిషన్ రెడ్డిపై మాజీ ఎంపి వ్యాఖ్యలకు బిజెపి నిరసనలు



**చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ అనుచితవ్యాఖ్యలు చేయడాన్ని నిరసన వ్యక్తం చేస్తూ అంజన్ కుమార్ యాదవ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమం శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లో బిజెపి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మల్లంపేట రమేష్ రామ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రమేశ్‌రామ్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉన్న అంజన్ కుమార్ యాదవ్ బాష మాట్లాడే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆయన మాట్లాడిన మాటలు వెనక్కు తీసుకొని కిషన్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆయనను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిజెపి ఓబీసీ జాతీయ కార్యవర్గసభ్యుడు పూసరాజు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గానుగపాటి సూర్యనారాయణ శర్మ, సీనియర్ నేతలు బి.రాంరెడ్డి, ఓబీసీ సెల్ నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, శేషసాయి, బిజెపి మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కో కన్వీనర్ తోలుపునూరి రమేష్ గౌడ్, రవి చారి, నవీన్ గౌడ్, వెంకటేష్, రఘునాథ్, శివాజీ, శక్తి సింగ్, నవీన్, రత్నా సాయి చందు, రాజశేఖర్, కంచి ముదిరాజ్ బద్రీనాథ్, నందు భాయ్, కనకేష్, చంద్రమోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# గుడ్ ఫ్రైడే సందర్భంగా గన్ ఫౌండరీలో జరిగిన కార్యక్రమాల దృశ్యాలు





## జెరూసలేం ప్రేయర్ చర్చ్‌లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** గుడ్ ఫ్రైడే సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ శంషుగూడ లోని జెరూసలేం ప్రేయర్ చర్చ్ లో పోస్టర్ రాజు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు హాజరయ్యారు.

## కార్మికులకు వాటర్ బాటిల్స్ పంపిణీ...



వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

**వివేకానంద కాలని ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నగరానికి అవార్డులు తీసుకురావడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద డివిజన్లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు వాటర్ బాటిల్స్‌ను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజం నిద్రలేవకముందే నగరంలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పారిశుద్ధ పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పారిశుద్ధ కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. పారిశుద్ధ నిర్వహణ పరిశుభ్రతలో కార్మికుల పనితీరు గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రావు, సలహాదారులు మహేష్ గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, జర్నలిస్టులు నాగరాజు యాదవ్, ఎల్లకొండ జయకుమార్ గుప్తా, హరి తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన నేతలు



మంత్రి కొండ సురేఖను కలిసిన నేతలు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నార్త్ లాలాగూడ కు చెందిన కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శి యం మోహన్ ఆర్ సుందర్ రాజన్ వెంకటేష్ యాదవులు శుక్రవారం రాష్ట్రమంత్రి కొండ సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు నార్త్ లాలాగూడ రైల్వే క్వార్టర్స్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ వీర హనుమాన్ దేవాలయంలో వచ్చే నెలలో జరిగేవేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

## శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతములతో అభిషేకం



మండపారాధనం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర, దేవి, నవగ్రహాది, హోమాలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** చిక్కడపల్లి బాపూనగర్ శ్రీ రాజరాజేశ్వర దేవాలయం 41 వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం చక్రమేరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సుగంద ద్రవ్యాలు, ఫలరసముల పంచామృతములతో అభిషేక కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు మండపారాధన, లక్ష్మీగణపతి, దేవి హోమం, అమ్మవారి మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, విశేష ఆశీర్వచనం తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తుల సామూహిక అభిషేకం, ఊరేగింపు, నందికోల సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్,.బిజెపి డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్,దామోదర్, శ్రీకాంత్, పి.నర్సింగ్ రావు, ఆలయ కమిటీ సభ్యులు అందోల్ రాజు, మహేష్, సాయి పాల్గొన్నారు. కాగా 19న మధ్యాహనం అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుంది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

## ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు సేవలు అందించాలి



విద్యుత్ ఉద్యోగికి అంబేద్కర్ ఎక్స్‌లెన్సి అవార్డు అందచేసి సన్మానం

**బేగంబజార్,ఏప్రిల్ 18ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థలో ఉద్యోగిగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు అత్యున్నతమైన సేవలను అందించినందుకు గుర్తించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎక్స్‌లేన్సి అవార్డును అంతడుపుల వేణుకు అందచేసి సన్మానించారు.దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ 1104 కార్మిక సంఘానికి అధ్యక్షులుగా కొనసాగుతూ గత 20 సంవత్సరాలుగా విద్యుత్ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు.రాజ్యాంగ విలువలకు అనుగుణంగా సమాజంలో ప్రజల సమానత్వంకోసం,మానవతా ప్రమాణాల కోసం పాటుపడుతున్న అంతడుపుల వేణును ప్లానింగ్ కమీషన్ ఛైర్మన్ చిన్నారెడ్డి,కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి,ప్రముఖ ఉపన్యాసకులు దేవజ్ఞశర్మలు శాలువ కప్పి సన్మానించి ఎక్స్‌లేన్సీ అవార్డును అందచేశారు.ఈకార్యక్రమంలో నవకళ వేదిక అధ్యక్షులు మల్లికార్జునరావు,మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు

## నవ్యనాటక సమితి కళారంగసేవ అపూర్వం : ఉపసంచాలకురాలు వసుంధర




చైత్రచంద్రిక అభినయ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వసుంధర, స్వప్నసుందరి, సుధామాల, విజయకుమార్ తదితర అతిథులు

**నాంపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఆరున్నర దశాబ్దాలకుపైగా భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళారంగాల్లో కళాకారులకు, ముఖ్యంగా యువ కళాకారుల ప్రతిభకు పట్టంకడుతూ ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి కళారంగ సేవ అపూర్వం అనితరసాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఖజానా లెక్కలశాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ప్రముఖ సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో నేటి నుండి 20 వరకు ప్రఖ్యాత నాట్యాచారిణి పద్మభూషణ్ విధుషీ స్వప్నసుందరిచే 3రోజులపాటు ఔత్సాహికులకు చైత్ర చంద్రిక పేరున అభినయంలో శిక్షణా శిబిరాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన జి.వసుంధర్ విధుషీ స్వప్నసుందరి, నృత్యగురువులు నిష్ఠల సుధామాల, ఇందిరా హేమ, మధుమతి కులకర్ణి, మాధవీమాల, ఎం. లక్ష్మిమానస, సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, బాలాజీశర్మ, కన్నారావులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ అభినయ శిక్షణా శిబిరాన్ని స్వప్నసుందరి స్వయంగా నిర్వహించడం, అరుదైన సాహిత్యాంశాన్ని ఎంపిక చేసుకొని అభినయంలో మెళకువలు నేర్పించడం యువకళాకారులకు లభించిన అరుదైన అపూర్వ సదవకాశమని, ఈ శిబిరంలో పాల్గొంటున్న యువ నృత్యకళాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. నృత్యసాహిత్యాంశాలకు తగిన విధంగా అందరికీ అర్థమయ్యే రీతిలో అభినయించడం చాలా ముఖ్యమని విధుషీ స్వప్నసుందరి అన్నారు. సరికొత్త విషయాలను ఆశక్తితో శ్రద్ధగా నేర్చుకోవాలని, యువ కళాకారులందరూ నిరంతర కృషి, సాధనతో భవిష్యత్తులో లబ్ధప్రతిష్టులు కావాలని ఆమె ఆకాంక్షించారు. ముందుగా స్వాగతోపన్యాసంలో సుధామాల శిక్షణా శిబిరం వివరాలను విశదీకరించారు. నృత్యగురువులు ఇందిరాహేమ, మధుమతి, మాధవీలత, లక్ష్మిమానసలు కార్యక్రమాన్ని సమన్వయపరిచారు.

## ఏడాది పాటు దేశవ్యాప్తంగా భూదాన ఉద్యమ వజ్రోత్సవాలు




సమావేశంలో మాట్లాడుతున్న వెదిరె అరవింద్‌రెడ్డి

**సైఫాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** భూమి లేని గ్రామీణ నిరుపేదలకు సాధికారతను తీసుకు రావడం కోసం పోచంపల్లిలో భూదాన ఉద్యమం ప్రారంభించి 75 ఏళ్ళు జరిగిన సందర్భంగా వజ్రోత్స వాలను నిర్వహిస్తున్నామని అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూదాన భూదాత వెదిరె రామ చంద్రారెడ్డి కొడుకు వెదిరె ప్రోమోతిష్ చంద్రరెడ్డి, అఖిల భారత సర్వసేవ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు తోలుపునురి కృష్ణగౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆచార్య వినోబా భవే పోచంపల్లిలో భూదాన ఉద్యమాన్ని ప్రారంభించిన అనంతరం మొదటిగా మామ తాత సామాజిక కార్యకర్త, భూస్వామి వెదిరె రామచంద్రారెడ్డిని కలిసి భూమని దానం చేయమని అభ్యర్థించగా మొదటగా వంద ఎకరాలు, ఆ తరువాత 800 ఎకరాలు, చివరికి మరొక వంద ఎకరాల భూమిని దానం చేశారని గుర్తు చేశారు. కొందరు భూఅక్ర మార్కులు వెదిరె రామ చంద్రరెడ్డి కుటుంబ సభ్యులపేర్లు చెప్పి భూదాన భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వారిపైన న్యాయమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల భూమిని వారు సేకరించడం జరిగిం దని, అప్పటి ప్రభుత్వాలు భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి కొంత మేరకు భూదాన భూములను పంపిణి చేశారని, కాగా గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొంత భూమి అన్యాక్రాంత అయ్యిందని ఆరోపించారు. ఇప్పటికి మిగిలి ఉన్న కొంత భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం రక్షించి, తక్షణమే భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు భూమిలేని నిరుపేదలకు పంచాలని, అక్రమణకు గురైన భూమిని కూడా ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని కోరారు.

## లంబాడితండాలో డబుల్‌బెడ్ ఇళ్ల ప్రాంగణంలో పనిచేయని లిఫ్టులు

-నూతన లిఫ్టులు ఏర్పాటు చేయా : అరవింద్‌కుమార్ యాదవ్



లంబాడితండలో డబుల్‌బెడ్ ఇళ్ళ ప్రాంగణంలో పనిచేయని లిఫ్టులను పరిశీలిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి లంబాడితండలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ ఇళ్ళ నిర్మాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు నాసికంగా వేయడం మూలంగా అనునిత్యం మొరాయించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఈ డబుల్‌బెడ్‌రూమ్ నిర్మాణ సముదాయం వద్ద లిఫ్ట్‌లు ఏర్పాటు చేయడం అవికూడా నాసిరకంగా వాటిని ఏర్పాటు చేయడం వల్ల అనునిత్యం మరమ్మత్తులు చేయడానికే సమయం సరిపోతోందని, ఎన్నిసార్లు రిపేర్లు చేసినా ఫలితం లేకుండా పోతోందని విమర్శించారు. ఇప్పటివరకు లిఫ్టుల మరమ్మత్తుల కోసం లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని, వీటిని భవన సముదాయంలో ఉంటున్న వారే భరిస్తున్నారని, ప్రస్తుతం ఇకముందు భరించే స్తోమత లేని పరిస్థితి ఉందన్నారు. దాదాపు తొమ్మిది అంతస్తులతో నిర్మితమైన ఈ భవనంలో దాదాపు వెయ్యి మంది వరకు నివసిస్తున్నారని, చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులు ఉన్నారని, లిఫ్టులు పనిచేయకపోవడం వల్ల అన్నివర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. లిఫ్టులు పనిచేయకపోవడం వల్ల పై అంతస్తులకు నడిచివెళ్లలేక బంధువుల ఇళ్ళకు వెళ్లాల్సిన దయనీయస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే కొత్త లిఫ్టులను వెంటనే ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రామానుజాలరెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నవీన్ నాయక్ అంజి యాదవ్,హరి ,సంతోష్,రవి ,సురేష్,సంజు,చందు,రాము,రవి,రాజేష్ పాల్గొన్నారు.



నగరంలో జరిగిన హై లైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## కూలిన ప్రహారీ గోడ.. వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త** ప్రహారీ గోడ కూలడంతో అక్కడే పని చేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దూలపల్లిలోని మహాలక్ష్మి లేఅవుట్ రోడ్డులో గల కాజీఎస్సీన్స్ బిల్డింగ్ పనులు చేపడుతుండగా అక్కడ ప్రమాదవశాత్తు ప్రక్క బిల్డింగ్ కాంపౌండ్ వాల్ కూలడంతో అక్కడే పని చేస్తున్న బొల్లి చెన్నయ్య (55) మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సోషల్ మీడియాకు బానిస కావొద్దు

-కూతురును మందలించిన తల్లిదండ్రులు

-మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్ళిపోయిన బాలిక

**హైదరాబాద్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** ఎప్పుడు చూసినా సోషల్ మీడియాలో మునిగి తేలుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలిక ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాలిక(16) ఏడోతరగతిలో చదువు ఆపేసి ఇంట్లోనే ఉంటోంది. గత కొన్నేండ్లుగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్ చాట్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాలో అకౌంట్స్ పెట్టుకున్న బాలిక ఎప్పుడు చూసినా చాటింగ్ చేస్తుండడంతో పాటు వీడియోలు చూస్తోంది.ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు పలుమార్లు నిలదీసినా అలవాటు మానుకోలేదు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం మరోసారి కుటుంబసభ్యులు సోషల్ మీడియాకు బానిస కావొద్దని సూచించారు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈ మేరకు బాలిక కుటుంబసభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అక్రమ నిర్మాణాలు ఎమ్మెల్యే అనుచరులవే!

-విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలి

-ఎమ్మెల్యేకు కాంగ్రెస్ యువనేత యుగంధర్ రెడ్డి సూటి ప్రశ్న



బాలనగర్ లో వెలసిన అక్రమ నిర్మాణం

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం వచ్చిందంటే కాంగ్రెస్ నాయకులు ఎగేసుకుని వెళ్లి ఇండ్లు కట్టే వాళ్లపై ఫిర్యాదులు చేసి లక్షల రూపాయలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే కూల్చివేయిస్తున్నారని, ఇదంతా అధికారుల ప్రోద్బలంతో నడుస్తోందన్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలు అవాస్తవమని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది స్వయంగా కూకట్పల్లి ఎమ్మెల్యేనేనని, దొంగే దొంగా... దొంగా... !అని అరిచినట్లు ఉందని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అనుచరుల అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేయడానికి వెళితే ఎమ్మెల్యే బతిమిలాడి వెనక్కు వచ్చేయమని ప్రాధేయపడటం సిగ్గుచేటు అన్నారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరులైన సతీష్ అరోరా, డేవిడ్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిలు అక్రమ నిర్మాణాలను కడుతున్నారని, వాళ్లపై ఫిర్యాదులు వెళ్లేసరికి, పుండు మీద కారం చల్లినట్లు కాగానే అక్రమంగా నిర్మించిన భవనాలను అధికారులు సీజ్ చేస్తున్నారని, లేదంటే అడిగినంత లక్షల్లో డబ్బులు ఇవ్వాలని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారని, అధికారులు కూడా కుమ్మక్కయ్యారని లేనిపోని మాటలు ఎమ్మెల్యేకు చెప్పి ఎక్కించి, ఎమ్మెల్యేను ఉసిగొలిపారని తీవ్రంగా విమర్శించారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్నవాళ్లు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించింది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు.

## బార్ అసోసియేషన్ జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహించాలి


-హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్




నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ వార్షిక దినోత్సవ సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త** జూనియర్ న్యాయవాదులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమినార్లను నిర్వహించి న్యాయవాద వృత్తిలో వారు తగిన నైపుణ్యం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నాగేష్ అన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ వార్షిక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ బీమపాక నాగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వృత్తిలోని మేలుకువలు నేర్చుకోవడానికి సీనియర్ న్యాయవాదుల సలహాలు తీసుకోవాలన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి ఇటీవల నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రవిశంకర్ అతని కార్యవర్గానికి సభకు పరిచయం చేస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు గంధం గురుమూర్తి, దిలీప్ కుమార్ జైస్వాల్, సురేందర్ రావు ఉమామహేశ్వరరావు, నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సిబిఐ, ఎసిబి కోర్టుల న్యాయమూర్తి టి రఘురాం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.రామచందర్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు జితేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, డి.వెంకటేష్,పి.వెంకటేశ్వర్, అబ్దుల్ ఖదీర్, కొండూరు వినోద్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆలేటి యాదగిరి, సురేఖ దీప్ సింగ్, భానుచంద్రిక తదితరులు పాల్గొన్నారు.





## ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం
### - పాస్టర్ సామ్యూల్ బాబు



బేతనియ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు, షీలా డోరతి బైరపోగు తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఏసుక్రీస్తు జీవితం మానవాళి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పాస్టర్, రెవరెండ్ సామ్యూల్ బాబు పేర్కొన్నారు. మూసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ లోని బేతనియ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే సాడ్ ఫ్రైడే కాదని, శుభశుక్రవారం అని తెలియజేశారు. యేసుక్రీస్తు శిలువని ఎక్కి తమ ప్రాణాలను విడిచిపెట్టిన రోజని వివరించారు. ప్రజలు ధర్మమార్గాన్ని అనుసరించాలని, ప్రతి ఒక్కరూ ఇతరుల పై దయాగుణం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి డేవిడ్ దౌలప్ప, బందారు సుధీర్ కుమార్, పాస్టర్ లిడియ లావుడి, తేజస్వి ప్రసాద్ రెడ్డి ప్రోగు, రెవరెండ్ రమేష్ బాబు,జాన్ మోజస్ కోదూరు, రెవరెండ్ సామ్యూల్ బాబు బైరబోగు తదితరులు వివరించారు. అదేవిధంగా ప్రత్యేక ప్రార్థనలను జీతాలను ఆలపించారు ఈ కార్యక్రమంలో షీలా డోరతి బైరపోగు, కిషోర్ బాబు, సన్నీ రెడ్డి పోగు, సత్యానందం, ప్రశాంత్, రేయు, స్వీటీ, సుదీర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## చలో వరంగల్ వాల్ పోస్టర్లు అంటించిన మాజీ మంత్రి మల్లారెడ్డి , మంద సంజీవరెడ్డి


బోడుప్పల్లో వాల్ పోర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి , మంద సంజీవరెడ్డి బిఆర్ఎస్ నాయకులు

**బోడుప్పల్ ఏప్రిల్18 ప్రభాతవార్త ;**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో బిఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గారి చేతులమీదుగా ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ ఎల్కతుర్తి రోడ్లో జరగబోయే రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ అవిష్కరణ బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తాలో చేశారు.ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ డైరెక్టర్ జడిగె రమేష్ యాదవ్ నాయకులు మీసాల క్రిష్ణ , కొత్త చక్రపాణి గౌడ్, కాటపల్లి రామచంద్రారెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్, బొమ్మక్ విశ్వనాథ్, చంటి శ్రీనివాస్ , కాటం రాజిరెడ్డి, దుర్గపు క్రిష్ణ గౌడ్, యూత్ నాయకులు సామల మనోహర్ రెడ్డి , వినయ్,సంతోష్ ,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు

## బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు
### -చర్చి అధ్యక్షుడు లూకానంద రావు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పాస్టర్ శాంత కుమార్, చిత్రంలో సీనియర్ పాస్టర్ డాక్టర్ బోడా సాల్మన్, చర్చి అధ్యక్షుడు లూకానంద రావు తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ బాప్టిస్ట్ చర్చిలో సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోద సల్మాన్, జూనియర్ పాస్టర్ శాంత కుమార్ ల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసు క్రీస్తు శాంతి, కరుణ, సహనం, ప్రేమ విలువల గురించి ప్రపంచానికి వివరించాలని తెలియజేశారు. యేసుక్రీస్తు శిలువపై మాట్లాడిన ఏడు మాటలు గురించి వివరించారు. ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా చర్చిలో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు లూకానంద రావు, ఉపాధ్యక్షులు రాణి ప్రమీల, సంయుక్త కార్యదర్శి విజయ శేఖర్, కోశాధికారి ఇంద్ ర్జీ, ఎడిఫయిస్ ఫండ్ చైర్మన్ ప్రసాద్ ఆంద్రూస్, చీఫ్ డెక్కన్ మోహన్ బాబు, కన్వీనర్ వెంకటరమణ, అంద్రు తదితరులు పాల్గొన్నారు.

## బియన్‌రెడ్డి ఆటో స్టాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు


చాలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీదేవి, గద్దె విజయ్ నేత

**వనస్థలిపురం.ఏప్రిల్ 18.ప్రభాతవార్త.** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చాలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ టి. డి.పి నాయకులు, సామాజికవేత్త గద్దె విజయ్ నేత పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి.నగర్ ఆటో స్టాండ్ వద్ద కీర్తిశేషులు జి.వి. చలపతిరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి శ్రీదేవి ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదట రోజు మజ్జిగతో చాలివేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ వేసవిలో చాలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు,అశోక్,రాములు,మనీష్ రాజు,హరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి స్కందయాగం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**
కొత్తపేట మారుతి నగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి శ్రీ రాజరాజేశ్వరి శ్రీ హరిహరసత అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో ఈనెల 23వ తేదీ నుంచి స్కందయాగం నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ ప్రజలు తెలిపారు. పలు దోషాల నుంచి విముక్తి పొందడానికి స్కందయాగం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సంద్యాగం చేసుకోవడం వల్ల గ్రహదోషాల నుంచి విముక్తి కలగడంతో పాటు శుభ ఫలితాలు కలుగుతాయి అన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్కంద యాగం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం : మాజీ మంత్రి మల్లారెడ్డి

**మేడిపల్లి ,ఏప్రిల్ 18 ప్రభాతవార్త ;** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ 25 రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న వేడుకలకు సంబందించిన వాల్ పోస్టర్ను మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...16 నెలల నుంచి కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది. కాంగ్రెస్ వచ్చింది నీళ్ల బంద్ అయినాయి. కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది.కాంగ్రెస్ వచ్చింది రియల్ ఎస్టేట్ మొత్తం కుప్పకూలిపోయిందదాంటూ ఏద్దేవా చేశారు. కేసిఆర్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని ప్రజలు కాంగ్రెస్, మాయమాటలను నమ్మి మోసపోయామని ఇప్పుడు మళ్ళీ కెసిఆర్, కేటీఆరే కావాలంటున్నారని, ఈనెల 27న వరంగల్ బీఆర్ఎస్ పార్టీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,



పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో చలో వరంగల్ సభను విజయం చేయాలని మాట్లాడుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జ్ లక్ష్మారెడ్డి ,మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

కొల్తూరు మహేష్ , మధుసూదన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి,మనోరంజన్ రెడ్డి,జావీద్ ఖాన్,ప్రభు, ఆంజనేయులు,బాలరాజు, వెంకట్,యాసారం మహేష్, జోగిరెడ్డి, శంకర్, రాజశేఖర్, సతీష్, మల్లం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులు ప్రారంభం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. ఏప్రిల్.18.ప్రభాతవార్త.**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని 21 శివారు కాలనీల డ్రైనేజీ ఔటలెట్ సమస్య తీరబోతుందని,రెండు రోజుల్లో పనులు ప్రారంభమైతాయని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో కలిసి రాచకాలువ గుండా పర్యటించారు.డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను పురాతన రాచకాలువ గుండా తీసుకెళ్లాలను ఆప్రాంతాని పరిశీలించారు.గత ఎన్నికల ముందు శివారు 21 కాలనీలు డ్రైనేజీ పైపులైన్ వేయడానికి 6 కోట్ల నిధులు మంజూరు చేయించి శంఖుస్థాపన లు చేయడం జరిగిందన్నారు.అయితే ఈ పనులు శిలాఫలకాలకే పరిమితమవుతాయని,ఎన్నికల స్టంట్ అని విమర్శించిన కాంగ్రెస్, బి.జె.పి.పార్టీల నాయకులు తాము మంజూరు చేయించిన పనుల దగ్గర ఫోటోలు దిగి షో పుటప్ చేస్తున్నారని విమర్శించారు. స్థానిక బి.జె.పి ప్రజాప్రతినిది డ్రైనేజీ ఔటలేట్ కోసం ప్రయత్నం చేయక పోగా ,తామే డ్రైనేజీ పనులు ఆపుతున్నామని కాలనీ వాసులను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసం అన్నారు,గత సంవత్సర కాలంగా డ్రైనేజీ ఔటలెట్ కోసం పురాతన రాచకాలువ ను గుర్తించి ,ఈ కాలువ గుండా పైప్ లైన్ వేద్దామని ప్రణాళికలు వేస్తుంటే,ఇతర పార్టీల నాయకులు బురదజల్లడం సరికాదన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్,


బి.యన్.రెడ్డి నగర్ శివారు కాలనీలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

అధికారులు సంయుక్తంగా రాచకాలువ ను సర్వే చేశారని త్వరలో పనులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే వివరించారు. డివిజన్ బి.ఆర్.ఎస్.అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ డ్రైనేజీ ఔటలేట్ గురించి ఆలోచించకుండా అక్రమ వసూళ్ల కు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాచకాలువ పై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించాడని,హైడ్రా కు పిర్యాదు చేసి ,అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్,రెవెన్యూ, జలమండలి అధికారులు శ్రీనివాస్ రెడ్డి,రాజగోపాల్, సర్వేయర్ జ్యోతి,డి ఈ.శుక్లజ,ఏఈ సతీష్ వివిద కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సోనియా, రాహుల్‌గాంధీపై ఈడి కేసులు ఎత్తివేయాలి : కాంగ్రెస్

**రామంతాపూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అధినేతలు సోనియా, రాహుల్ గాంధీలపై ఈడి తప్పుడు కేసులు నమోదు చేసిందని ఆరోపిస్తూ రామంతాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తవిడబోయిన గిరిబాబు, సీనియర్ నేతలు సుర్వి మురళీ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని మహిపాల్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, బోరంపేట కృష్ణ, బొజ్జ రాఘవరెడ్డి, ఐకాన్ మోహన్‌రెడ్డి,యూత్ కాంగ్రెస్ మాజీ కోఆర్డినేటర్ దర్శనం వినోద్ ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తికుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు పి.కోటేష్, సీనియర్ నాయకులు పబ్బోజు బిక్షపతి చారి, పబ్బు గణేష్, బెజ్జం యాదగిరి, కిషన్‌నాయక్, బాల నరసింహా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్



కాంగ్రెస్ పార్టీ నేతలపై ఈడి కేసులకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కేసులో రాజకీయ కక్షతోనే కేసులు పెట్టారని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన పత్రికలో పెట్టుబడులు పెడితే మనీ లాండరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ వర్గీకరణతో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఆధరణ చూసి ఓర్వలేకే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకాష్, రాజేష్, వాసు, సతీష్, సింగం కిరణ్, మురళీ,సాయి, పూస మల్లికార్జున్ పాల్గొన్నారు.

## డివిజన్ నేతలతో ఎమ్మెల్యే సమావేశం

### -జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**అత్తాపూర్ ఏప్రిల్ 18,ప్రభాతవార్త :**
జై బాపు,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారంమైలార్‌దేవ్‌పల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో డివిజన్ నేతలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జై బాపూ, జై భీమ్ ,జై సంవిధాన్ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్ తయారు చేయాలని నేతలకు ఆయన పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా ఉండి జే బాపు జై భీమ్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సిఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈడి,



సిబిఐల వాడుకుంటూ ప్రతిపక్షాలపై కేసులు నమోదు చేయిస్తుందని ఆరోపించారు.పేదల సంక్షేమాని కేంద్ర ప్రభుత్వం మరిచిపోయి మతరాజకీయాలు చేస్తుందని అన్నారు .బిజెపి పాలనలో రాజ్యాంగాన్ని సవరణల పేరుతో పూర్తి భ్రష్టుపటిస్తుందని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజ్యాంగంపై బిజెపి వ్యవహరిస్తున్న తీరు ప్రజలకు వివరించాలని సూచించారు. శనివారం (నేడు) మైలార్‌దేవ్‌పల్లి ,శంషాబాద్, గండిపేట మండలాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ సమావేశాలు నిర్వహిస్తున్నామని శంషాబాద్, గండిపేట్ మండలాల నాయకులు, కార్యకర్తలు వాటిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉప్పల్ సర్కిల్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఉప్పల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ ఎఇ నిఖిల్ తెలిపారు. ఉప్పల్ బ్యాంక్‌కాలనీ, జాహిద్‌నగర్, ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, ఈస్ట్ కల్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రకాలనీ, టీచర్స్ కాలనీ, అజ్మత్ నగర్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 3.30 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

**హబ్సిగూడలో :** హబ్సిగూడ పరిధిలోని స్నేహపురికాలనీ, శ్రీనగర్ కాలనీ, భవానీనగర్, పిఅండ్‌టి కాలనీ,నాచారం ప్రధాన రహదారి లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ వి.గణేష్ తెలిపారు.

**ఉప్పల్ భగాయత్‌లో.**
ఉప్పల్ భగాయత్ పరిధిలోని ఉప్పల్ భగాయత్, ఆరంజ్, ఆర్డో అపార్ట్‌మెంట్, మెట్రో ప్రాజెక్ట్, హెచ్‌ఎండిఏ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం 4 నుంచి 4.30 వరకు, సరస్వతికాలనీ పీడర్ పరిధిలోని సరస్వతి కాలనీ, ఆర్‌టిఏ ఆఫీసు,ఎస్‌విఎం హోటల్, నాగోల్ మెట్రో స్టేషన్ పరిధిలో ఉదయం పది నుంచి పదిన్నర వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

**రామంతాపూర్‌లో..**
రామంతాపూర్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్ పీడర్ పరిధిలోని ఎండోమెంట్ కాలనీ, గోఖలేనగర్, ఆర్‌టిసి కాలనీ పరిధిలో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం 12 వరకు, విశాల్ పీడర్ పరిధిలోని గణేష్‌నగర్, గుప్త గార్డెన్, మధురానగర్, పిఎస్ కాలనీ పరిధిలో సాయంత్రం 3 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ కె.లావణ్య తెలిపారు.

## ప్రజలు ధర్మ మార్గాన్ని అనుసరించాలి
### -పాస్టర్ ప్రభు చరణ్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రభు చరణ్ తదితరులు

**మలక్ పేట,ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
ప్రజలు ధర్మ మార్గాన్ని అనుసరించాలని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చ్ ఫౌండర్ పాస్టర్ ప్రభు చరణ్, చర్చి పాస్టర్ వన్య ఇమ ని న్యూయేల్ లు పేర్కొన్నారు. మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో వారి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సోదర భావంతో మెలగాలని పేర్కొన్నారు. ప్రేమ, కరుణ ద్వారా ప్రజల్లో ఆనందాన్ని నింపిన యేసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శం అన్నారు. ఏసుక్రీస్తు శిలువ పై పలికిన ఏడు మాటల గురించి వివరించారు. అదే విధంగా ప్రత్యేక ప్రార్థనను నిర్వహించి భక్తిశ్రద్ధలతో భక్తి గీతాలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

## వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ తనిఖీలు



వనస్థలిపురం పోలీస్ స్టేషన్లలో కమిషనర్ సుధీర్ బాబు తనిఖీ చేస్తున్న దృశ్యం

**వనస్థలిపురం ఏప్రిల్ 18,ప్రభాతవార్త :**
రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు మరియు సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపిఎస్ గారు ఈ రోజు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## సైదాబాద్‌లో సిఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దగ్ధం


సైదాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

**సైదాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్‌లో ఒక వర్గం వారిపై దాడులను నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో సైదాబాద్ మెయిన్ రోడ్డుపై పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అద్యక్షుడు నిరంజన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, బిజెపి అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి దశరథలక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల రెడ్డిలు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న దాడుల వెనుక ఉగ్రవాదుల హస్తం ఉందని వారు ఆరోపించారు. అక్కడి ముఖ్యమంత్రే దాడులను ప్రోత్సహించే విధంగా మాట్లాడడం శోచనీయమన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు అమర్నాథ్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, ముద్దం శ్రీకాంత్‌రెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, ప్రశాంత్, ఉగాది మహేష్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు.

**హయత్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**
హయత్ నగర్ లోని లేబర్ అడ్డా ప్రాంగణంలో శుక్రవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ)వాల్ పోస్టర్ ను సంఘం జిల్లా నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, ఎల్ బీ నగర్ నియోజక వర్గ నాయకులు సక్కు నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. సంఘటిత పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 21, 22 తేదీల్లో శంషాబాద్ లో జరగనున్న రాష్ట్ర మహాసభకు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున హాజరై మహా సభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సన్ఘం హయత్ నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు చెంది వెంకట్, గోల్కొండ నాగరాజు, నాయకులు మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి మర్రి శోభన్, నాయకులు కృష్ణ, శ్రీను, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం
### : రాగిడి లక్ష్మారెడ్డి


ఉప్పల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, పిల్లి నాగరాజు తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వేసవిలో వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు బిజెపి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో వేసవిలో రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు ఉమారెడ్డి, కరిపె సంతోష్, గొరిగె మల్లేష్, పంగ మహేందర్‌రెడ్డి, సాయి, జగన్, రంగ భాస్కర్‌గౌడ్, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



తెలంగాణ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల ప్రారంభోత్సంలో మాజీ ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**
తెలంగాణ అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు శుక్రవారం రామంతాపూర్‌లో ఘనంగా ప్రారంభం అయ్యాయి. చాంపియన్‌షిప్ సెక్రటరీ,పవర్ లిఫ్టింగ్ ఏసియన్ గోల్డ్‌మెడలిస్ట్ కందగంట్ల దయానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం తగు సహకారం అందిస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. పవర్‌లిఫ్టింగ్ నిర్వహకులు దయానందరెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి రెండు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని, మొత్తం 150 మంది హాజరైనట్లు తెలిపారు. శనివారం మహిళల పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు ముత్తినేని జగదీష్, సీనియర్ పవర్ లిఫ్టర్ బుర్ర రాజేశ్వర్, తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ చైర్మన్ బుచ్చిదాస్‌గౌడ్,రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌గౌడ్, జోసెఫ్ జేమ్స్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉప్పల్ 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం


ఉప్పల్ 108 అంబులెన్స్‌లో ప్రసవించిన చిన్నారిని బందువులకు అప్పగిస్తున్న సిబ్బంది దృశ్యం

**ఉప్పల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**
పురిటినొప్పులతో బాధపడుతున్న ఒక మహిళకు ఉప్పల్ 108 అంబులెన్స్ సిబ్బంది పురుడుపోసి తల్లి బిడ్డలను రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేడిపల్లి పల్లిలో నివాసం ఉంటున్న మహేష్ యాదవ్ భార్య లక్ష్మి గర్భవతిగా ఉంది. శుక్రవారం పురిటినొప్పులు రావడంతో ఉప్పల్ 108 సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఉప్పల్ 108 సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మహిళను గాంధీ ఆసుపత్రికి తరలిస్తున్నారు. మార్గ మధ్యలో అమెకు పురిటినొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ లో ప్రసవం చేసినట్లు తెలిపారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.అనంతరం తల్లిబిడ్డను ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించినట్లు తెలిపారు. ఉప్పల్ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నాగరాజు, పైలట్ ఉపేందర్ వారిని ఆసుపత్రిలో చేర్పించారు. సిబ్బందిని పలువురు స్థానికులు అభినందించారు.

## కొత్తపేటలో గావ్ చలో బస్తీ చలో

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**
బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా కొత్తపేట డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ అధ్యక్షతన గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించగా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పలు కార్యక్రమాలు నిర్వహించారు. చిత్తారమ్మ దేవాలయం పరిసరాల ప్రాంతాలను శుభ్రం చేశారు.బస్తీలో పర్యటించి బిజెపి జెండాలను వాడు ఆవిష్కరించారు. అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో పార్టీకి పనిచేసిన కొత్తపేట డివిజన్ సీనియర్ నాయకులను, నాలుగు దశాబ్దాలుగా బిజెపికి సేవలు అందిస్తున్న సీనియర్ నాయకులను శాలువాలతోసత్కరించారు. బస్తీ వాసులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఉపేందర్ సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాత దేవాలయంలో మూడు రోజులపాటు శత చండీయాగం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**
శ్రీ సీతారామాంజనేయ స్వామి శ్రీ సంతోషిమాత దేవాలయంలో శత చండి యాగ సహిత ఏక త్రింశత్ (31) వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులపాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలలో భాగంగా అక్షయ తృతీయ రోజు అభిషేకాలు, సరస్వతి పూజ, గణపతి హోమం, చండీ పారాయణము, పుష్పాలంకరణ, శత చండి యాగము పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు నియమ నిబంధనలు పాటించాలి
### - మలక్ పేట ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలాల, ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**
అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, మలక్ పేట ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలక్ పేట ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ నియమ, నిబంధనలను పాటించి సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మాక్ డ్రిల్స్ లను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.